క్లుప్తంగా

మంచి పనులే కలకాలం గుర్తుంటాయి



బదిలీ ఉద్యోగులను సన్మానించిన చైర్మన్, ఈఓ, పాలకమండలి

మహానంది: విధి నిర్వహణలో ఉద్యోగులు చేసిన మంచి పనులే కలకాలం గుర్తుండటంతో పాటు గుర్తింపు తెస్తాయని మహానంది ట్రస్ట్ బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మహానందిలో పని చేస్తూ వివిధ ఆలయాలకు బదిలీ అయిన నలుగురు ఉద్యోగులను శనివారం సాయంత్రం స్థానిక కార్యాలయంలో సన్మానించారు. ఆలయ సూపరింటెండెంట్ శశిధర్‌రెడ్డి శ్రీకాళహస్తికి, ఉద్యోగులు నీలకంఠరాజు, నాగమల్లయ్య కసాపురం, ఎలక్ట్రిషియన్ వెంకటేశ్వర్లు శ్రీశైలం ఆలయాలకు బదిలీ అయిన విషయం తెలిసిందే. కార్యక్రమంలో అర్చకులు, వేదపండితులు, ధర్మకర్తల మండలి సభ్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం

కొత్తపల్లి: ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వ రం అని సర్పంచు షేక్ నాజియా అన్నారు. శనివారం మండల పరిధిలోని ఎదురుపాడు గ్రా మంలో పింజరి మేరాంబీకి మంజూరైన రూ. 40 వేల చెక్కు అందించారు. ఆమె మాట్లాడుతూ.. గతేడాది సెప్టెంబర్ నెలలో గ్రామానికి చెందిన పింజారి మేరాంబీ ట్రాక్టర్ ప్రమాదంలో గాయపడి చికిత్స తీసుకుంద న్నారు. వైద్య ఖర్చుల నిమిత్తం శాప్‌చైర్మన్ బైరెడ్డి సిద్దార్థరెడ్డి కృషి ఫలితంగా ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.40వేలు చెక్కు మంజూరు అయిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు రహంతుల్లా ఉన్నారు.

పరీక్షా కేంద్రాల తనిఖీ

మిడుతూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆదర్శ పాఠశాల పదో తరగతి పరీక్షా కేంద్రాలను శనివారం ఫ్లైయింగ్ స్క్వాడ్, ఎంఈఓ కోటయ్య , మిడుతూరు ఎంఈఓ మౌలాలి తనిఖీ చేసిశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 41 మంది విద్యార్థులకు 26 మంది హాజరైనట్లు పరీక్షల నిర్వహన అధికారి నాగరమేష్ తెలిపారు. ఆదర్శ పాఠశాలలో 47 మంది విద్యార్థులకు 26 మంది హాజరైనట్లు పరీక్ష నిర్వహణ అధికారి పార్వతి తెలిపారు.

పుల్లయ్య గౌడ్ కుటుంబాన్ని ఆదుకోవాలి

కొత్తపల్లి: మండలం శివపురం గ్రామంలో ఉపాధి పనులకు వెళ్లి ఎండ వేడిమికి తట్టుకోలేక గుండెపోటుకు గురై మరణించిన పుల్లయ్య గౌడ్ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ స్వాములు డిమాండ్ చేశారు. శనివారం శివపురం గ్రామంలో పుల్లయ్య గౌడ్ కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబానికి 10 లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేషియా చెల్లించి కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతు వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు జి దాసు. పి చిన్న చిన్నయ్య పి నగేష్ తదితరులు పాల్గొన్నారు.

సాగునీరిచ్చి ఆదుకోండి

జూపాడుబంగ్లా: మండ్లెం, తంగడంచ, భాస్కరాపురం గ్రామాల్లోని పొలాలకు తాటిపాడు ఎత్తిపోతల పథకం 1, 2 ద్వారా సాగునీటిని సరఫరా చేసి ఆదుకోవాలని రైతులు కోరారు. మండలంలోని మండ్లెం గ్రామంలో చేపట్టిన జలదీక్ష కార్యక్రమం శనివారం నాటికి 39వ రోజుకు చేరింది. కార్యక్రమంలో సురేష్, శివప్రసాదు, అరుణ్, శ్రీను, నాగరత్నం తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా జీవించండి



మాట్లాడుతున్న ఎస్ఐ హుస్సేన్ బాషా

కొత్తపల్లి: గ్రామాల్లో ప్రజలు ప్రశాంతమైన జీవనాన్ని గడపాలని ఎస్ఐ హుస్సేన్‌బాషా అన్నారు. శనివారం రాత్రి మండంలోని నందికుంట గ్రామాన్ని సందర్శించి గ్రామస్తులతో మాట్లాడారు. గ్రామంలో అల్లర్లకు, గొడవలకు పోకుడదని సూచించారు. అదేవిధంగా అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. నాటుసారా, అక్రమ మద్యం గ్రామంలో ఎవరైన అమ్మితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేయాలి

నందికొట్కూరు/ఆత్మకూరు: మహిళా రెజ్లర్లపై లైగింక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఏసురత్నం, పట్టణ కార్యదర్శి రణధీర్, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఏ జిల్లా అధ్యక్షులు నాగార్జున, డక్క కుమార్ డిమాండ్ చేశారు. శనివారం ఆత్మకూరు, నందికొట్కూరు పట్టణాల్లో ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా భారతదేశ ఖ్యాతిని ప్రపంచ నలుమూలల చాటిన రెజ్లర్లపై భారత రెజ్లింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ లైంగిక వేధింపులకు పాల్పడటం దారుణమన్నారు.

పంట కాలువనూ వదల్లేదు

- ఆక్రమణకు గురవుతున్న గుండు తూము కాలువ
- కుంచించుకుపోతున్న వైనం
- ఆందోళన చెందుతున్న దిగువ రైతులు



గుండు తూము కాలువ



నెహ్రూనగర్ సమీపంలో రామకృష్ణారెడ్డి పొలం వద్ద కాలువను ఆక్రమించి కట్టిన రాతి కట్టడం

పగిడ్యాల: కబ్జాకు కాదేది అనర్హం అంటూ కొందరు ఏకంగా పంట కాలువనే కబ్జా చేసి పొలంలోకి కలుపుకుంటున్నారు. ముచ్చుమర్రి క్రాస్ రోడ్డు మొదలుకుని వీరాపురం క్రాస్ రోడ్డు వరకు భూములు ఉండే రైతులు గుండు తూము కాలువను ఆక్రమిస్తూ కాలువ స్వరూపాన్నే కుదించి వేస్తున్నారు. దీంతో కాలువ వెడల్పు తగ్గిపోవడం వలన నీటి ప్రవాహానికి పొలాల గెనాలు తెగిపోయి నీటి తడులు కట్టుకోవడానికి అవస్థలు పడాల్సి వస్తుందని పలువురు అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

600 ఎకరాలకు సాగునీరు..

కేసీ కెనాల్‌పై 87 ఏఎల్ కిలోమీటర్ వద్ద నిర్మించిన గుండు తూము కాలువ కింద దాదాపు 600 ఎకరాలకు పైగా ఆయకట్టు విస్తీర్ణం ఉంది. రోజుకు 6 నుంచి 7 క్యూసెక్కుల నీరు దిగువ ప్రాంత రైతులకు అవసరమవుతుందని సంబంధిత ఏఈ నరేష్ వెల్లడి చేస్తున్నారు.ఈ కాలువ కింద ఎక్కువ శాతం రైతులు వరి పంటను సాగు చేస్తారు. వరి పంట సాగుకు నీటి తడుల అవసరత ఎక్కువగా ఉంటుంది. అయితే కొందరు చేతిలో డబ్బుందని, ఏమి చేసినా చెల్లుబాటు అవుతుందని ఏకంగా పంట కాలువనే కబ్జా చేయడం శోచనీయం. పూర్వం నుంచి ఉన్న పంట కాలువను అక్రమార్కులు స్వార్థంతో స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నిస్తుండడం విచారకరం.

పాద హద్దులు చెడగొట్టి..

గుండు తూము కాలువ 6 మీటర్ల వెడల్పు కలిగి ఒక మీటరుకు పైగా లోతుతో ఉండి దిగువకు నీరు ప్రవహిస్తుంది. కాలువను ఆనుకుని సాగులో ఉన్న రైతులు మధు, మల్లయ్య, బీరయ్య, రామిరెడ్డి, నరసింహ, తిక్కస్వామి, పెద్ద తిక్కస్వామి, చిన్న తిక్కస్వామి, శ్రీను, రామకృష్ణారెడ్డిల కన్ను కాలువపై పడింది. అదే తడువు చకా చకా పాత కాలువ హద్దులను చెడగొట్టి నడి సెంటర్‌కు రాతి కట్టడాలను కట్టి ఆక్రమిస్తుండడం గ్రామంలో చర్చనీయాంశమైంది. దీంతో దిగువన ఉండే పొలాల రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

అధికారులపై అనుమానాలు..

కేసీ కాలువ కింద ఎకరా పొలం రూ. 25 లక్షల నుంచి రూ. 30 లక్షల వరకు డిమాండ్ ఉన్నందున ప్రభుత్వ పోరంబోకు, పంట కాలువ శివాయిజం, బంజరు భూములు కనిపిస్తే చాలు కబ్జాకు పాల్పడుతున్నారు. పెత్తందార్లు పంట కాలువ స్థలాన్ని ఆక్రమించుకుని సొమ్ము చేసుకోవడానికి ప్రయతిస్తున్నా గ్రామ పెద్దలు, రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులు పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. అధికారుల అండదండలు లేకపోతే కాలువ పోరంబోకు స్థలాలను ఆక్రమించే దుస్సాహసం చేయరని గ్రామస్తులు వెల్లడి చేస్తున్నారు. పంట కాలువను కబ్జా చేసుకుంటూ పోతే క్రమేనా కాలువ కనుమరుగయ్యే ప్రమాదం లేకపోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏటేటా ఆక్రమణకు గురవుతున్నా గుండు తూమూ కాలువ విస్తీర్ణాన్ని పరిరక్షించాలని కోరుతున్నారు.

విచారణ చేపడతాం

పంట కాలువను ఆక్రమిస్తే దిగువకు సాగునీరు వెళ్లదు. ఈ కాలువకు 6 నుంచి 7 క్యూసెక్కుల నీరు దిగువకు ప్రవహిస్తుంది. పటం కాలువను ఆక్రమించినట్లు మా దృష్టికి వచ్చింది. వర్క్ఇన్‌స్పెక్టర్, లష్కర్‌లను పంపి విచారించి బాధ్యులపై చర్యలు చేపడతాం.

– నరేష్, నీటిపారుదల శాఖ ఏఈ

శ్రీశైలంలో ప్రత్యేక పూజలు



స్వామిఅమ్మవార్లకు ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో లోక కల్యాణం కోసం పౌర్ణమిని పురస్కరించుకుని స్వామి అమ్మవార్లకు విశేషపూజలు నిర్వహించారు. శనివారం శ్రీస్వామిఅమ్మవార్లకు పల్లకీ ఉత్సవాన్ని నిర్వహించారు. ముందుగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు సేవా సంకల్పాన్ని పఠించి, మహాగణపతిపూజ జరిపించారు. అనంతరం శ్రీస్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో ఆశీనులను చేసి శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలు జరిపారు.

ఊయలసేవ

భ్రమరాంబాదేవికి పౌర్ణమిని పురస్కరించుకుని దేవస్థాన అర్చకులు శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. ఊయలలో స్వామిఅమ్మవార్లను ఆశీనులను చేసి షోడశోపచార పూజలను నిర్వహించిన అనంతరం అమ్మవారికి అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్రనామ పూజలు జరిపించారు.

భ్రామరీకి లక్షకుంకుమార్చన

శ్రీశైల శ్రీభ్రమరాంబాదేవికి శనివారం పౌర్ణమి ఘడియలు ప్రారంభమవడంతో సాయంత్రం లక్షకుంకుమార్చన సేవను శాస్త్రోక్తంగా జరిపించారు. శ్రీశైలానికి స్వయంగా విచ్చేయలేని భక్తులు వారి గోత్రనామాలతో లక్షకుంకుమార్చనలో భక్తులు పరోక్షసేవగా పాల్గొనే అవకాశం దేవస్థానం కల్పించింది. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర నుండి కూడా భక్తులు 21మంది పరోక్షసేవ ద్వారా పూజలో పాల్గొన్నారు.

భక్తులకు బ్యాటరీ వాహన సౌకర్యం

శ్రీశైలంటెంపుల్: మల్లన్న భక్తుల సౌకర్యార్థం శ్రీశైల దేవస్థానం ఏర్పాటు చేసిన బ్యాటరీ వాహనాలను శనివారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ప్రారంభించారు. ఐదు వాహనాల్లో మూడు పంచమఠాల సందర్శనకు, మరో రెండు వాహనాలు ఆర్టీసీ బస్టాండ్ నుంచి క్షేత్ర పరిధిలోని పలు ముఖ్య ప్రాంతాలకు నడుపబడుతున్నాయి. ఈ వాహనాల ద్వారా భక్తులు ఉచితంగా ఘంటామఠం, భీమశంకరమఠం, విభూతిమఠం, రుద్రాక్షమఠం, సారంగధర మఠం, మహిషాసుర మర్ధిని ఆలయం, హేమారెడ్డి మల్లమ్మ మందిరం, దేవస్థాన గోశాల, బయలు వీరభద్రస్వామి ఆలయం , అంకాళమ్మ ఆలయాలను సందర్శించవచ్చు. అలాగే వృద్ధులకు, దివ్యాంగుల కోసం ఆర్టీసీ బస్టాండ్ నుంచి సీఆర్వో ఆఫీసు, గంగా–గౌరీ సదన్, మల్లికార్జున సదన్, క్యూకాంప్లెక్స్ వరకు ఈ వాహన సదుపాయం కల్పించబడుతుంది. కార్యక్రమంలో దేవస్థాన ఈఓ ఎస్.లవన్న, స్వామి వారి ఆలయ ప్రధానార్చకులు హెచ్.వీరయ్యస్వామి, అమ్మవారి ఆలయ ప్రధానార్చకులు పి.మార్కండేయశాస్త్రి, ఈఈ వి.రామకృష్ణ, ఎం.నరశింహారెడ్డి, ఏఈవో హరిదాసు, డీఈఈ చంద్రశేఖరశాస్త్రి, ఏఈలు ప్రణయ్ పాల్గొన్నారు.



బ్యాటరీ వాహనాలకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మంత్రి కొట్టు

మాడవీధుల పరిశీలన..

దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ శనివారం ఆలయ పశ్చిమ, ఉత్తర, తూర్పు మాడవీధులను పరిశీలించారు. మల్లన్న దర్శనాంతరం భక్తులు సేద తీరేందుకు, మాడవీధులలో జరుపబడే వాహనసేవలను భక్తులు వీక్షించేందుకు వీలుగా పశ్చిమ మాడవీధులో సుమారు రూ.కోటి వ్యయంతో చేపడుతున్న గ్యాలరీ నిర్మాణ వివరాలను తెలుసుకున్నారు. అలాగే ఉత్తర, తూర్పు మాఢవీధుల్లో ప్రాకార కుడ్య శిల్పాలను పరిశీలించారు.

భూముల పరిశీలన

మిడుతూరు: మండల కేంద్రంలోని రోళ్లపాడు పరిధిలోని అటవీభూమి, నాగలూటి ప్రాంతంలోని గట్టు ప్రాంతాన్ని శనివారం ఆర్‌డీఓ దాసు పరిశీలించారు. ఆర్‌డీఓ మాట్లాడుతూ 340 సి నేషనల్ హైవే నిర్మాణానికి నందికొట్కూరు మండలం దామగట్ల సమీపంలో 5.18 సెంట్ల అటవీభూమిని కేటాయించారన్నారు. ఆ భూమి స్థానంలో అటవీశాఖకు రోళ్లపాడు పరిధిలో 132 /బీ2 సర్వేనంబర్‌లో 5.20 సెంట్ల భూమిని అటవీశాఖకు ప్రభుత్వ భూములను కేటాయించేందుకు జిల్లా కలెక్టర్ ఉత్వర్వులు ఇచ్చారన్నారు. ఈ మేరకు భూములను పరిశీలించడానికి వచ్చినట్లు ఆర్‌డీఓ తెలిపారు. ఆదేవిధంగా నేషనల్ హైవే నిర్మాణం కోసం నాగలూటి గట్టు ప్రాంతంలో కంకర లీజు కోసం పీఎస్‌కే ఇన్‌ఫ్రా స్ట్రక్చర్ ప్రవేట్ లిమిటెడ్ కంపెనీ వారు జిల్లా కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. దీంతో నాగలూటి గట్టు ప్రాంతం, రోళ్లపాడు అటవీభూమిని పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సిరాజుద్దీన్, డీప్యూటీ రేంజ్ అధికారి ఎస్. జెడ్. ఏ. తాహేర్, సర్వేయర్ కృష్ణుడు, ఆర్ మహమ్మద్ హుస్సేన్, ఫారెస్టు బీట్ అధికారి రవి తదితరులు పాల్గొన్నారు.



రోళ్లపాడులో భూమిని పరిశీలిస్తున్న ఆర్‌డీఓ

పదో తేదీ లోగా పనులు పూర్తి చేయాలి



పడమర నెహ్రూనగర్ పాఠశాలలో పనులను పరిశీలిస్తున్న ఈఈ రామకృష్ణారెడ్డి

పగిడ్యాల: రెండవ విడుత నాడు నేడు పథకం కింద పాఠశాలల్లో చేపట్టిన పనులను పంచాయతీరాజ్ శాఖ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్(ఈఈ) రామకృష్ణారెడ్డి పరిశీలించారు. శనివారం మండలంలోని తూర్పు, పడమర నెహ్రూనగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలు, పీకే ప్రాగటూరు గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, పాత ముచ్చుమర్రి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, కొత్త ఎల్లాల, కొత్త ముచ్చుమర్రి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభమవుతాయని నిర్మాణాలను 10వ తేదిలోగా పూర్తి చేసి విద్యార్థులకు అసౌకర్యం లేకుండా చూడాలని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో నందికొట్కూరు పంచాయతీ రాజ్ డివిజనల్ ఇంజినీర్ ధనిబాబు, మండల ఇంజినీర్ వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

గృహాలు త్వరగా నిర్మించుకోవాలి

జూపాడుబంగ్లా: ఇల్లు మంజూరైన లబ్ధిదారులు త్వరగా పక్కాగృహాలు నిర్మించుకోవాలని తహసీల్దార్ పుల్లయ్యయాదవ్, ఎంపీడీఓ మంజులవాణి, హౌసింగ్ ఏఈ శ్రీనాథ్, ఈఓపీఆర్డీ మణిమంజరి సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం జూపాడుబంగ్లా జగనన్నకాలనీలో హౌసింగ్‌డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు కాలనీలో నిర్మించుకుంటున్న పక్కాగృహాలను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. జూపాడుబంగ్లా జగనన్నకాలనీని మోడల్‌కాలనీగా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు మనోజ్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: జగనన్న కాలనీలో పక్కా గృహాలను నిర్మించుకుంటున్న లబ్ధిదారులు తమ గృహాలను వేగవంతంగా పూర్తి చేయాలని శ్రీశైలం నియోజకవర్గ ప్రత్యేక అధికారి పరమేశ్వరి అన్నారు. శనివారం హౌసింగ్ డే సందర్భంగా జగనన్న కాలనీలో పక్కా గృహాలను సందర్శించారు. పట్టణంలోని చక్రంహోటల్, దుద్యాల రస్తా, మైనార్టీ కాలనీలోని పక్కా గృహాలను పరిశీలించారు. ఇల్లు నిర్మించుకున్న లబ్ధిదారులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ ఉమామహేశ్వర్, ఏఈ ఉమామహేశ్వరరెడ్డి, తహసీల్దార్ ప్రకాష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు ఆస్పత్రికి వెళ్లి పింఛన్ల పంపిణీ

కొత్తపల్లి: రాష్ట్రంలో ప్రతి నెల వైఎస్సార్ పింఛన్‌ను సచివాలయ సిబ్బంది, గ్రామవలంటీర్లు లబ్ధిదారుల ఇంటివద్దకే వెళ్లి అందజేస్తున్నారు. మండలంలోని ముసలిమడుగు గ్రామానికి చెందిన పెద్ద వెంకటేశ్వర్లు అనే వృద్ధుడికి ప్ర మాదావశాత్తు కాలువిరిగింది. దీంతో ఆయన కర్నూలు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న వెల్ఫేర్ అసిస్టెంట్ కిరణ్ కర్నూలుకు వెళ్లి లబ్ధిదారునికి వృద్ధాప్యపింఛన్ రూ.2,750 పంపిణీ చేశాడు.

జూపాడుబంగ్లా: మండలంలోని తాటిపాడు గ్రామానికి చెందిన శేషయ్య అనే వ్యక్తి ఐదురోజుల క్రితం ప్రమాదవశాత్తు బైక్‌పై నుంచి కిందపడటంతో కాలువిరిగింది. అతను కర్నూలులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ఆపరేషన్ చేయించుకొని చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న వలంటీర్ ఖాజాబీ ఆసుపత్రికి వెళ్లి అతనికి జూన్ మాసానికి సంబంధించిన పింఛన్ అందజేసింది.దీంతో అతనితో పాటు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో పెద్దవెంకటేశ్వర్లకు పింఛన్ అందజేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్ కిరణ్

సమస్యలు పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులదే

- ఎమ్మెల్యే తొగురు ఆర్థర్
- పడమర ప్రాతకోటలో 'గడప గడపకు మన ప్రభుత్వం'
- ఆలస్యంగా వచ్చిన అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం



హౌసింగ్ వర్క్ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్‌పై ఆగ్రహం వ్యక్తం చేసున్న ఎమ్మెల్యే ఆర్థర్

పగిడ్యాల: ప్రజా సమస్యలు పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. సమయపాలన పాటించకుండా ఇష్టానుసారంగా గడప గడప కార్యక్రమానికి హాజరైన హౌసింగ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండవ రోజైన శనివారం పడమర ప్రాతకోట గ్రామంలో ఉదయం 8.30 గంటలకు గడప గడప కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. అలాగే ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గోరంట్ల ఎస్సీ కాలనీవాసులు నీటి సమస్యతో అల్లాడిపోతున్నా ఎవ్వరు పట్టించుకోవడం లేదని పిల్లలు, పెద్దలు, మహిళలు ఎమ్మెల్యేతో ఏకరువు పెట్టారు. ఇల్లు మంజూరు చేయాలని హౌసింగ్ అధికారుల చుట్టూ ప్రదక్షణలు చేసినా స్పందించడం లేదని రామకృష్ణ కుమారుడు ఎమ్మెల్యేతో వాపోయారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే హౌసింగ్ ఏఈ ఎక్కడా.. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఏరీ అంటూ పిలిచారు. వారి జాడ కనిపించలేదు. దాదాపు పదిహేను నిమిషాలు నిరీక్షించినా అధికారులు అందుబాటులోకి రాలేదు, వర్క్ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్ ఎమ్మెల్యే ఎదుట తారసపడ్డారు. దీంతో కోపోద్రేక్తుడైన ఎమ్మెల్యే సమయపాలన పాటించడం తెలియదా అంటూ ఆగ్రహించారు. అధికారులు మండలంలో పనిచేస్తున్నారా లేదా నీటి సమస్యతో అల్లాడుతున్నా ఎందుకు పరిష్కరించడం లేదని ఏఈ శివకుమార్‌ను నిలదీశారు. దళితులు అంటే చులకన భావమా అంటూ విరుచుకుపడ్డారు. కార్యక్రమానికి లేటుగా వచ్చిన అధికారులపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు రిపోర్ట్ పెడుతామని హెచ్చరించారు. అనంతరం కార్యక్రమాన్ని యధాతథంగా ముందుకు కొనసాగించి పూర్తి చేశారు. ఎస్సీ కాలనీలలో నెలకొన్న తాగునీటి సమస్యకు తక్షణ పరిష్కారం చూపించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటరమణ, తహసీల్దార్ భారతీ, ఏఓ విజయ్ జ్యోతుకుమార్, ఏఈలు వెంకటేశ్వర్లు, శివకుమార్, జ్యోతి, రాష్ట్ర హౌసింగ్ కార్పోరేషన్ డైరెక్టర్ రమాదేవి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎస్ రమణ, వైఎస్సార్‌సీపీ నాయకులు సుభాన్, వెంకటేశ్వర్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అబ్బీపురంలో విషాదం

మహానంది: అరుణాచలం వెళ్తూ రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన సి.ప్రతాప్‌రెడ్డి స్వగ్రామం అబ్బీపురం కావడంతో గ్రామంలో విషాదం నెలకొంది. ప్రతాప్ కొన్నేళ్లుగా చేపల వ్యాపారం, రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేస్తూ నంద్యాల పట్టణంలో స్థిరపడ్డారు. గ్రామానికి చెందిన రామసుబ్బారెడికి ముగ్గురు కుమారులు కాగా ప్రతాప్‌రెడ్డి రెండో కుమారుడు. ఇటీవల తండ్రి అనారోగ్యంతో మృతి చెందారు. ప్రతాప్‌రెడ్డికి భార్య స్వాతి, కుమారుడు ,కుమార్తె ఉన్నారు.

రైలు ప్రమాదానికి ప్రధాని బాధ్యత వహించాలి

నందికొట్కూరు: రైలు ప్రమాదానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ బాధ్యత వహించాలని సీపీఎం నాయకులు నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒడిస్సా రాష్ట్రంలో కోరమండల్ ఎక్స్‌ప్రెస్ గూడ్ రైలు ఢీకొన్న సంఘటనలో 300 మంది మృతి చెందడం బాధకరమన్నారు. మోదీ అధికారంలో వచ్చిన తరువాత ప్రభుత్వ రంగాలను ప్రైవేటీకరణ చేయడం దుర్మార్గమన్నారు. రైల్వే రంగాన్ని ప్రైవేటీకరణ చేసి రెండు శాతం ఉద్యోగాలను కుదించారని గుర్తు చేశారు. సంఘటనకు బాధ్యత వహించి రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వెంటనే రాజీనామ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం నాయకులు శ్రీనివాసులు, ఓబులేసు, ఆంజనేయులు, రంగమ్మ, జయరాజు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పోటాపోటీగా ఆలయాల భూముల వేలాలు

మహానంది: బండిఆత్మకూరు మండలం కడమలకాల్వలో కొలువైన శ్రీ శివనందీశ్వర, చెన్నకేశవ, వెంకటేశ్వర, భైరవస్వామి ఆలయాలకు చెందిన సుమారు 73 ఎకరాల భూములకు శనివారం వేలం పాటలు జరిగాయి. పోటాపోటీగా జరిగిన ఆలయభూముల వేలాల ద్వారా గతే కంటే ఈ ఏడాది అదనంగా ఆదాయం లభించినట్లు ఈఓ నాగప్రసాద్ తెలిపారు. గత ఏడాది భూముల ద్వారా రూ.6.83లక్షలు రాగా ప్రస్తుతం రూ. 13,95,500 వచ్చినట్లు చెప్పారు. దీంతో సుమారు రూ. 7.12లక్షలు ఆదాయం వచ్చినట్లు వివరించారు. గ్రూపుదేవాలయాల ఇన్‌స్పెక్టర్ రవికిరణ్‌కుమార్‌రెడ్డి పర్యవేక్షణలో వేలాలు జరిగాయి.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఆత్మకూరు: సీజనల్ వ్యాధుల పట్ల వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు ఆదేశించారు. పట్టణంలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో వైద్య సిబ్బందితో శనివారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేస్తూ ఎప్పటికప్పుడు ఆరోగ్య సమస్యలు తెలుసుకోవాలన్నారు.

క్రైం కార్నర్

బెయిల్‌పై వచ్చిన ముద్దాయి ఆత్మహత్య

వెలుగోడు: పట్టణంలోని అయ్యపురెడ్డి నగర్ కాలనీకి చెందిన తెలుగు వెంకటరాముడు(50) అనే ముద్దాయి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శనివారం చోటుచేసుకుంది. ఎస్ఐ జగన్‌మోహన్ తెలిపిన వివరాలు మేరకు.. మృతుడు ఒక కేసులో ముద్దాయి. కడప సెంట్రల్‌జైలులో శిక్ష పొందుతూ అనారోగ్యం కారణంతో హై కోర్టు నుంచి 30 రోజుల బెయిల్‌పై 8 రోజుల క్రితం ఇంటికి వచ్చాడు. కాగా ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఇంటి ఆవరణలోని చెట్టుకు ఉరి వేసుకున్నాడు. మృతుడి కుమారుడు శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. కాగా మృతదేహాన్ని పంచనామా నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

కేసు నమోదు

మహానంది: మండల కేంద్రమైన ఎం.తిమ్మాపురం గ్రామానికి చెందిన విశ్వేశ్వరుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. శనివారం రాత్రి ఆయన మాట్లాడుతూ మద్యం సేవిస్తూ గ్రామంలో గొడవలకు దిగడం, స్థానికులను దూషిస్తుండటంతో బాధితుల ఫిర్యాదు మేరకు కౌన్సెలింగ్ నిర్వహించి కేసు నమోదు చేశామన్నారు.

యువకుడి అదృశ్యం



వడ్డె సాగర్

జూపాడుబంగ్లా: మండలంలోని తంగడంచ గ్రామానికి చెందిన వడ్డె సాగర్ అనే 16 ఏళ్ల యువకుడు కనిపించకుండా పోయిన ఘటన చోటుచేసుకుంది. శనివారం ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపిన వివరాల మేరకు...గ్రామానికి చెందిన వడ్డె లక్ష్మిదేవి, వడ్డె నరసింహులు దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు సంతానం. పెద్దకుమార్తెకు వివాహం అయింది. కుమారుడు వడ్డె సాగర్ ఇంటర్ వరకు చదివి ఇంటి వద్దనే ఉంటున్నాడు. ఈనేపథ్యంలో ఈనెల ఒకటోవ తేదీన తల్లిదండ్రులు, కుమార్తె ఉదయం 7గంటలకు గ్రామంలోని ఉపాధి పనులకు వెళ్లారు. వారు తిరిగి 10.30గంటలకు ఇంటికిరాగా కొడుకు వడ్డెసాగర్ కనిపించలేదు. దీంతో వారు ఆచూకీకోసం గ్రామంలో గాలించినా, బంధువులకు ఫోన్‌చేసినా ప్రయోజనం లేకపోవటంతో శనివారం జూపాడుబంగ్లా పోలీసులను ఆశ్రయించారు. ఎస్ఐ వెంకటసుబ్బయ్య కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. యువకుని ఆచూకీ ఎవ్వరికైనా తెలిసినట్లయితే వెంటనే జూపాడుబంగ్లా పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

మహానంది: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న గాజులపల్లె ఆర్ఎస్ గ్రామానికి చెందిన మురారి శంకర్ గౌడు(40) కోలుకోలేక శనివారం మృతి చెందాడు. రెండ్రోజుల క్రితం గోపవరం మెట్ట వద్ద రెండు బైకులు ఢీకొన్న సంఘటనలో నందిపల్లెకు చెందిన నటరాజ్ అక్కడికక్కడే దుర్మరణం చెందగా మరో బైక్‌పై కుమారుడితో కలిసి ఇంటికి వెళ్తున్న మురారి శంకర్ గౌడు తలకు తీవ్రంగా గాయాలయిన విషయం తెలిసిందే. నంద్యాల ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరగా కోలుకోలేక మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. శంకర్‌గౌడుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. నంద్యాల రైల్వేస్టేషన్‌లో పార్సిల్ సర్వీస్‌లో పనిచేస్తూ కుటుంబాన్ని పోషించే శంకర్ గౌడ్ మృతితో కుటుంబంలో విషాదం నెలకొంది.

మహిళ ఆత్మహత్య

మిడుతూరు: మండలకేంద్రమైన మిడుతూరు ఎస్సీ కాలనీకి చెందిన ఓ మహిళ కీళ్లవాతం నొప్పులు తాళలేక ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చోటుచేసుకుంది. ఎస్ఐ మారుతిశంకర్ తెలిపిన వివరాల మేరకు ఎస్సీ కాలనీకి చెందిన విద్యపోగులక్ష్మీదేవి(48) అధిక బరువు, కీళ్ల వాతం, నొప్పులు తట్టుకోలేక ఇంట్లో ఉన్న థిమెట్ గుళికలను గురువారం ఉదయం 10 గంటలకు మింగి అపస్మారక స్థితిలోకి వెళ్లింది. గమనించిన కుటుంబసభ్యులు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక శుక్రవారం సాయంత్రం మృతిచెందింది. మృతురాలికి భర్త సుధాకర్, ఇద్దరు కూతుర్లు, ఇద్దరు కుమారులు ఉన్నారు. శనివారం భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కొత్తపల్లి: పురుగుల మందు సేవించి అస్వస్థతకు గురై చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం చోటుచేసుకుంది. మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు తెలిపిన వివరాల మేరకు.. కొత్తపల్లి గ్రామానికి మంగలి చిన్న వెంకటరమణ(22)కు నంద్యాల జిల్లా బేతంచెర్ల మండలం, ఎంబాయి గ్రామానికి చెందిన మౌనికతో 2019 సంవత్సరంలో పెళ్లి అయింది. కొద్దిరోజులు బాగానే ఉన్న కుటుంబ సమస్యలతో భార్య మౌనిక పుట్టింటికి వెళ్లింది. అప్పటినుంచి భర్తను కుటుంబ సభ్యులతో, ఇతర వ్యక్తులతో, బంధువుల పెళ్లిళ్ల వద్ద బెదిరిస్తూ డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేసేవారు. భార్య తరపు వారి వేధింపులు తట్టుకోలేక మే నెల 26వ తేదీన నంద్యాల ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేసి, న్యాయం జరగడంలేదని మనస్తాపానికి గురైన వెంకటరమణ పురుగుల మందు సేవించారు. గమనించిన పోలీసులు అతన్ని నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించి వైద్యం అందించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు రెఫర్ చేశారు. కర్నూలు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడాని కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. భార్య మౌనిక, వారి బంధువులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.